క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన



గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లింగగిరి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ షేక్ జరీనాబేగం పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్రవంతి, మీరాబీ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఉన్నారు.

బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మల్లారెడ్డి



మల్లారెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గరిడేపల్లి : మండల పరిధిలోని పరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మేకల మల్లారెడ్డి నేరేడుచర్ల బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. అనంతరం మల్లారెడ్డి మాటాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం నిరంజన్ రెడ్డి, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కటకం రమేష్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు రామాంజిగౌడ్, మాజీ సర్పంచ్ ముప్పారు వెంకటేశ్వర్లు, చింతల వెంకటేశ్వర్లు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం సొసైటీ నూతన అధ్యక్షుడిగా మట్టయ్య



మట్టయ్య

చిలుకూరు : మండలంలోని నారాయణపురం ప్రాథమిక సహకార సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా దేశబోయిన మట్టయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సంఘం చైర్మన్‌గా ఉన్న సైదులు అవినీతికి పాల్పడుతూ సొంత అవసరాలకు సంఘంలోని నగదును వాడుకున్నట్లు పలువురు డైరెక్టర్లు జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. విచారణలో డబ్బులు దుర్వినియోగం చేసినట్లుగా రుజువుకావడంతో అతడిని చైర్మన్ విధుల నుంచి తొలగించారు. సంఘం కార్యకలాపాల నిర్వాహణకు తాత్కాలిక అధ్యక్షుడిగా మట్టయ్యను నియమిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పంటలకు నష్టపరిహారం అందించాలని వినతి



ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : ఆయకట్టులో ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం అందజేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షుడు ఎం.కనకారావు, నాయకులు వెంకటయ్య, అంజయ్య, సాంబయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చిలుకూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ మీసేవా నిర్వాహకుడు మండవ వీరబాబు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం తహసీల్దార్ ధ్రువకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. నీటిని వృథా చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మంజుల, చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మల్లం వెంకటేశ్వర్లు, కొల్లు నాగయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

మునగాల : మండల కేంద్రానికి చెందిన రాయిల శేషయ్య అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అతడు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.25వేల చెక్కును శనివారం మండల కేంద్రంలో వైస్‌ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య బాధితుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ మాట్లాడారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో చెక్కు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కాసర్ల కోటేశ్వరరావు, పార్టీ అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు ఉన్నారు.

బస్తీ దవాఖానాకు సుస్తీ

- డాక్టర్లు లేకపోవడంతో దవాఖానాకు తాళం వేస్తున్న సిబ్బంది
- వైద్యం అందక రోగుల అవస్థలు
- మౌలిక వసతులు కల్పించి, సిబ్బందిని నియమించాలని ప్రజల వేడుకోలు



నేరేడుచర్ల : రాంపురంలో తాళం వేసి ఉన్న బస్తీ దవాఖానా

నేరేడుచర్ల : పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. కాని ఆ దవాఖానాల్లో సరైన వసతులు, సిబ్బంది లేకపోవడంతో రోగులకు ఉపయోగపడకుండా మారుతున్నాయి. మున్సిపాలిటీలోని రాంపురం, శాంతినగర్, పాత నేరేడుచర్లలోని పేదలకు వైద్యం అందుబాటులో ఉంచేందుకు 2023 మే 26న బస్తీ దవాఖానాను ప్రారంభించారు. ప్రారంభం నాటి నుంచి నేటి వరకు ప్రజలకు ఆరోగ్య సేవలు అందించకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దవాఖానా ప్రారంభం నాటి నుంచి డాక్టర్ రాకపోవడంతో రెండు రోజుల క్రితం నూతన డాక్టర్‌ను నియమించారు. ఆ నూతన డాక్టర్ ఈనెల 22న బాధ్యతలు స్వీకరించి వెళ్లి మళ్లీ ఇప్పటి వరకు దవాఖానా వైపు తిరిగి రాకుండా ఉన్నాడు. బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్సు, ఒక నర్సు ఉండాల్సి ఉండగా ఒక స్టాఫ్ నర్సు మాత్రమే ఆ రోజు నుంచి ఈ రోజు వరకు మధ్యాహ్నం వరకే విధులను నిర్వర్తిస్తున్నారు. ఆ స్టాఫ్ నర్స్ మధ్యాహ్నం వరకు మొక్కుబడిగా దవాఖానాను తెరిచి ఉంచి అనంతరం తాళం వేసి వెళ్తున్నారు. దీంతో దవాఖానాకు అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులు తాళం వేసి ఉండటంతో వెనుదిరుగుతున్నారు. బస్తీ దవాఖానాలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రోగులకు సాధారణ జ్వరం, దగ్గు, షుగర్, బీపీతో పాటు 80మంది నుంచి 100మందికి రెండు వందల రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, 145 రకాల మందులు పంపిణీ చేస్తూ ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాల్సి ఉంది. కాని ఆ సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దవాఖానాకు సరిపడి వైద్యసిబ్బంది నియమించకపోవడమే కాకుండా ఉన్న సిబ్బంది అరకొరగా వీధులకు హాజరవుతున్నారు. దీంతో దవాఖానాకు మధ్యాహ్నం తర్వాత ఎప్పుడు తాళం వేసే ఉంటుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్తీ దవాఖానాలో మెరుగైన సేవలను అందించాలని ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



బస్తీ దవాఖానాలో మెరుగైన వైద్యసేవలను అందించడంతో పాటు పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలి. దవాఖానాకు నియమించిన డాక్టర్ వీధులకు సరిగా రాకపోవడంతో వైద్య సేవలు నిలిచిపోతున్నాయి. దీంతో మధ్యాహ్నం తరువాత దవాఖానాకు తాళం వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– కుమారస్వామి, రాంపురం (నేరేడుచర్ల)

సాఫ్ట్‌వేర్ రంగంపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధి సుష్మ

చిలుకూరు : ఇంజనీరింగ్ విద్యార్థులు సబెక్టులతో పాటు ఇంగ్లిష్ భాషపై సంపూర్ణంగా పట్టు సాధించాలని బెంగుళూరుకు చెందిన వరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధి సుష్మ సూచించారు. శనివారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సులభ పద్ధతిలో, ప్రాక్టికల్ పద్ధతిలో ప్రతి అంశాన్ని నేర్చుకోవాలన్నారు. ప్రధానంగా ఇంజనీరింగ్ విద్యార్థులు స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రపంచంలో గొప్పగొప్ప ఇంజనీర్లు అందరు గ్రామీణ ప్రాంతాలలోని కళాశాల నుంచి వచ్చిన వారే అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, పలువురు కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కోదాడ : విద్యార్థులు చదువుల్లో, క్రీడల్లో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని తేజ ఫౌండర్ డైరెక్టర్ సోమిరెడ్డి, ఎంఎస్ విద్యాసంస్థల సీఈఓ ఎస్ఎస్.రావు అన్నారు. శనివారం పట్టణంలోని తేజ టాలెంట్ పాఠశాలలో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అప్పారావు, కరస్పాండెంట్ జానకి రామయ్య, ఝాన్సీ, రాంమ్మూర్తి, సోమానాయక్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రావొద్దు



నడిగూడెం : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి



మోతె : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ముప్పాని ఆశ



మునగాల : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఎలక బిందు

మునగాల : ప్రస్తుతం వేసవి సమీపించడంతో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని, అందుకు ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలని ఎంపీపీ ఎలక బిందు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను ప్రత్యేక అధికారులు గుర్తించి సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తాగునీటి సమస్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వేసవిలో మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎటువంటి తీర్మానాలు చేయకుండానే సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ నల్లపాటి ప్రమీల, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, గ్రామాలకు చెందిన ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నడిగూడెం : ప్రస్తుత వేసవిలో మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓకార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో చేతి పంపులకు, ఓవర్‌హెడ్ ట్యాంకులపై సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అలాగే తాగునీటికి ఇబ్బందులు తలెత్తితే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే విధంగా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కోత లేకుండా చూడాలని, వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బాణాల కవిత, తహసీల్దార్ హేమామాలిని, ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

మోతె : మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ ముప్పాని ఆశ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వేసవిలో గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. గ్రామపంచాయతీ బోరు బావులు లేకపోతే అద్దె బోర్లతో ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, వైస్‌ఎంపీపీ మైనంపాటి సునీత, ఎంపీడీఓ హరిసింగ్‌నాయక్, తహసీల్దార్ సంఘమిత్ర, సూపరింటెండెంట్ వెంకటాచారి, ఎంఈఓ గోపాల్‌రావు, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రేపాలలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పరమపదోత్సవంలో పాల్గొన్న భక్తులు

మునగాల : మండలంలోని రేపాల శివారులోని శ్రీస్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 20నుంచి పదిరోజుల పాటు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. నాల్గవ రోజైన శనివారం కమిటీ ఆధ్వర్యంలో పరమపదోత్సవం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సారిక చినరామయ్య తెలిపారు.

నేటినుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్, కోలాట పోటీలు

మండలంలోని రేపాలలో గల శ్రీస్వయంభూ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నేటి నుంచి ఈనెల 28వరకు రాష్ట్ర స్థాయి క్రికెట్, కోలాట పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సారిక నాగరాజు, పల్లి సైదిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఈనెల 25, 26తేదీల్లో కోలాట పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల్లో పాల్గొనే గ్రూప్ వారు రూ.500ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.20,116లను ఎంపీపీ ఎలక బిందు ప్రకటించగా, ద్వితీయ బహుమతి రూ.15,116లు దేవరగట్ల రామారావు, మూడో బహుమతి రూ.10,116లను పల్లి ఆదిరెడ్డి-రేణుక దంపతులు, నాల్గవ బహుమతి రూ.5,116లను మాజీ సర్పంచ్ పల్లి రమణ-వీరారెడ్డి దంపతులు ప్రకటించారని వారు తెలిపారు. వివరాలకు 95028 26769, 95055 33084ను సంప్రదించాలని అన్నారు. అదే విధంగా ఆదివారం నుంచి ఈనెల 28వరకు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.400ఎంట్రీఫీజును చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని, పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.10, 016, ద్వితీయ బహుమతిగా రూ.7,016, తృతీయ బహుమతిగా రూ.4,016, చతుర్ధ బహుమతిగా రూ.3,016 నగదును ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 95425 67959, 99599 09927, 99482 95126ను సంప్రదించాలన్నారు.

కార్యదర్శికి సన్మానం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జక్కుల వీరయ్యను శనివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మిత్రులు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అశోక్, రాజేష్, శివ, పర్వతాలు, కోటి, వెంకటేష్ ఉన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

మఠంపల్లి : బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు చరిత్రను వక్రీకరిస్తున్నాయని, వారి కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రజాకార్ సినిమాలో వీర తెలంగాణ విప్లవ సాయుధ రైతాంగ పోరాటం జరిగిన అవాస్తవిక కథను పూర్తిగా వక్రీకరించి మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించిన ఈ సినిమాను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు మాలోత్ బాలునాయక్ ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

గరిడేపల్లి : మండల పరిధిలోని పొనుగోడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తిదాయకం



కోదాడ : సమావేశంలో మాట్లాడుతున్న రామనర్సయ్య



హుజూర్‌నగర్ : భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మునగాల : కొక్కిరేణిలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సైదులు

కోదాడ : యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తిదాయకమని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆర్.రామనర్సయ్య అన్నారు. శనివారం పట్టణంలోని కేఆర్‌ఆర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశం కోసం చిరుప్రాయంలోనే ప్రాణాలను త్యాగం చేసిన వారి ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, అదే వారికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. యువత అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి, కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

హుజూర్‌నగర్ : దేశంలో బ్రిటీష్ సామ్రాజ్యవాద దోపిడీ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో ఉద్యమించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి డి.రవి అన్నారు. శనివారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 30వ రకు భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభలను నిర్వహించాలని కోరారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ప్రశ్నించే గొంతులపై వివిధ చట్టాలను ప్రయోగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సింహాద్రి, ఉదయ్, శ్రీను, సంతోష్, మోహన్, వెంకన్న, సిద్ధు, సైదులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామంలో పలు సంఘాల ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుల, వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, రైతు సంఘం గ్రామ కార్యదర్శి రావులపెంట వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రావులపెంట బ్రహ్మం, హమాలీలు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాద శక్తులను ఓడిద్దామన్నారు. వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులు మోదీని ఓడించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, కడారు మధు, షేక్ రఫీ, అంబటి శేఖర్, మోదిన్‌పాషా, జిలానిపాషా తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్, నాయకులు కొరట్ల బ్రహ్మయ్య, కాసాని రాంబాబు, వినోద్, ఉపేందర్, చంటి, గణేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సీపీఐ పట్టణ ప్రధాన కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఉదర వెంకన్న, నాయకులు కోమట్రాజ్ వెంకట్, గోవింద్‌గౌడ్, శ్రీకాంత్, శ్రీను, నాగశేఖర్, జానయ్య, జగ్గారావు, సైదులు, భిక్షం తదితరులున్నారు.

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో..

పట్టణంలో భగత్‌సింగ్, రాజ్‌గురుచ్, సుఖ్‌దేవ్ వర్ధంతిని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాస పల్లయ్య, వాసా కరుణాకర్, హుస్సేన్, సత్తెమ్మ, మరియమ్మ, నాగమణి, ఫాతిమా, కృష్ణయ్య, అరుణ, సైదాబి, ఆనంద్, లక్ష్మయ్య, లక్ష్మమ్మ, ఫాతీమా, తదితరులున్నారు.



నడిగూడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు



నేరేడుచర్ల : భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చిలుకూరు : భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

నేటినుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయిలో గల రుక్మిణి, సత్యభామ, గోదాదేవి సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉత్సవమూర్తులకు నవకలశ పంచామృత అభిషేకం, నూతన పట్టువస్త్రాలంకరణ, సోమవారం ధ్వజారోహణ, గరుడముద్రలు, బలిహరణ, రాత్రి 8గంటలకు ఎదుర్కోళ్లు, అనంతరం స్వామి కల్యాణం, మంగళవారం సుదర్శన హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం, మార్చి 27న స్వామివారి గరుడవాహన సేవ, ఊరేగింపు, 28న క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి వారి వార్షికోత్సవ విశేషపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, 30రాత్రి స్వామివారి పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ యాదా వెంకటేశ్వర్లు తెలిపారు.

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



నర్సింహులగూడెంలో కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ, కేంద్ర బలగాలు

మునగాల : రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తగా శనివారం మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన నర్సింహులగూడెం, జగన్నాథపురం, కలకోవ, నారాయణగూడెం గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సూచించారు. అదే విధంగా మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసినట్లు సీఐ రామకృష్ణారెడ్డి వెల్లడించారు.

నేడు తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం

మోతె : మండల కేంద్రంలో గల శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామివారి కల్యాణాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పగడాల వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 2002-03 విద్యా సంవత్సరానికి చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, అదే విధంగా మోతె యూత్ కమిటీ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డ, వేపలసింగారం గ్రామాల ఫీడర్ పరిధిలోని 11కేవీ విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ అధికారి రాంప్రసాద్ శనివారం తెలిపారు.

నేరేడుచర్ల : మండలంలోని మేడారం ఫీడర్‌లో 11కేవీ విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ మండల ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని మేడారం, బక్కయ్యగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

నడిగూడెం : మండల కేంద్రంలో 11కేవీ విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఎస్‌కె.సైదా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అక్రమ నల్లా కనెక్షన్లు తొలగించాలని వినతి

మునగాల : మండలంలోని నర్సింహాపురంలో గ్రామపంచాయతీ మెయిన్ పైప్‌లైన్‌కు కొందరు అక్రమంగా నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేసుకొని తాగునీటిని వృథా చేస్తున్నారని, తక్షణమే నల్లా కనెక్షన్లను తొలగించాలని గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో శనివారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి గ్రామంలోకి వచ్చే మెయిన్ పైప్‌లైన్‌కు కొందరు గ్రామస్తులు అక్రమంగా నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేయడంతో నీరు వృథాగా పోతుందన్నారు. నల్లాలను తొలగించాలని కోరినట్లు తెలిపారు.